
రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973 9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.

సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను
శ్రీకాకుళం జిల్లాలో అమరాన్ బ్యాటరీలు, ఇంజిన్ ఆయిల్స్ అమ్మేందుకు మార్కెటింగు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ కనీస విద్యార్హత గల 25 సంవత్సరాలలోపు వయసు గలవారై ఉండాలి. మార్కెటింగ్‌లో అనుభవం గలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి గలవారు పూర్తి బయోడేటాతో అక్టోబరు 23న ఉదయం 11 గంటలకు హాజరుకావలెను.
AMARON® LASTS LONG, REALLY LONG.
కిరణ్ ఆటోమొబైల్స్, పెద్దపాడు రోడ్డు, శ్రీకాకుళం-532 001,
సెల్: 9490 222 716, 94401 95005

ICL COURIER
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
పచ్చళ్లు, బట్టలు, పిండివంటలు, బుక్స్, స్వీట్స్, మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944472, 9248199493

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 22-10-2024
సంపుటి: 20 సంచిక: 178
పేజీలు: 4 వెల: రూ.1



# ఊరు మనదే తాసేయ్!



- అసలే ఫోర్జరీ.. అందులో గ్రామకంఠం
- తప్పుడు నెంబర్లు వేసి కోటబొమ్మాళిలో రిజిస్ట్రేషన్
- తహసీల్దార్ సంతకాలు ఫోర్జరీ అని తెలిసినా పట్టించుకోని అధికారులు
- లబోదిబోమంటున్న గ్రామస్తులు

జిల్లాలో ఏదైనా భూమిని కాజేయాలనుకుంటున్నారా? అది ప్రభుత్వ భూమైనా ఫర్వాలేదు. అప్పటికే ఆ భూమిలో వేరేవారి సొంత భవనాలు ఉన్నా ఇబ్బందే లేదు. మీరు ఫోర్జరీ పత్రాలు తెచ్చినా రిజిస్ట్రేషన్ చేయడానికి జిల్లాలో ఒక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. అది మరెక్కడో కాదు.. కోటబొమ్మాళి. సబ్‌రిజిస్ట్రార్‌లు ఎంతమంది మారినా జిల్లాలో వివాదాస్పద భూములకు, ఫోర్జరీ పత్రాలతో వచ్చిన ఎండార్స్‌మెంట్లతో ఎంచక్కా రిజిస్ట్రేషన్ చేసేస్తారు. ఆ తర్వాత సివిల్ మేటరని కోర్టుల చుట్టూ తిరగాల్సింది మాత్రం మనమే. ఫోర్జరీ ఎండార్స్‌మెంట్‌లు, పొజిషన్ సర్టిఫికేట్లతో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంను బరిడీకొట్టి ప్రభుత్వ భూములను దర్జాగా అనుభవిస్తున్నవారు జిల్లా అంతటా ఉన్నారు. ఫోర్జరీ ఎండార్స్‌మెంట్‌ను తీసుకొని రిజిస్ట్రేషన్ చేయడానికి వెళ్లి తిరస్కరించబడిన వారూ ఉన్నారు. వీటిని సదరు సబ్ రిజిస్ట్రార్లు ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లకు సమాచారం ఇచ్చి వివరణ కోరిన సందర్భాలు ఉన్నాయి. అటువంటిదే ఈ కథ కూడా.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మెళియాపుట్టి నుంచి తహసీల్దారు సంతకంతో గత నెల 18, ఈ నెల 13న వచ్చిన రెండు ఎండార్స్‌మెంట్‌లను ఫోర్జరీగా గుర్తించారు. ఈ రెండు ఎండార్స్‌మెంట్‌లు మెళియాపుట్టి మండల కేంద్రం నుంచి రావడం గమనార్హం. ఇదే కోవలో ఈ ఏడాది జనవరి 22న ఒకటి, జూలై 16న రెండు ఫోర్జరీ ఎండార్స్‌మెంట్‌లను తీసుకువచ్చి కోటబొమ్మాళి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దర్జాగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ వ్యవహారం సోమవారం గ్రీవెన్స్‌లో బాధితులు ఎం.గోవిందరావు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. రిజిస్ట్రేషన్ చేసిన భూమి గ్రామకంఠం కావడం మరో విశేషం. ఈ భూమికి ఎండార్స్‌మెంట్ ఇచ్చినట్టు తహసీల్దారు సంతకం, కార్యాలయం రౌండ్‌సీల్ వేసి కోటబొమ్మాళి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించి 53 సెంట్లు - మిగతా 4లో



## చాలా రోజుల తర్వాత ఒకే చూరులో జగన్, షర్మిల

## ఆకస్మికంగా ఢిల్లీ బయల్దేరిన బొత్స సత్యనారాయణ

## హర్యానా ఫలితాల తర్వాత జగన్‌ను దగ్గరచేసిన ట్వీట్

# పులివెందుల సాక్షిగా..
# అక్కడేదో జరుగుతోంది!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన సోదరి షర్మిలతో ఆస్తిపంపకాలు సెటిల్ చేసుకుంటున్నారని, ఆమె ద్వారా జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోడానికి సిద్ధపడుతున్నారంటూ రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి రాసిన కథనాన్ని వైకాపా సోషల్ మీడియా, ఆయన సొంత మీడియా పరోక్షంగా కొట్టిపారేసినా పులివెందుల సాక్షిగా అక్కడ ఏదో జరుగుతోంది. అందులో ఎటువంటి సందేహం లేదు. జగన్మోహన్‌రెడ్డి, ఆమె సోదరి షర్మిల ఆస్తుల పంపకాలు పూర్తయిపోతే ఇక శత్రుత్వాలను పక్కన పెడతారని ఆంధ్రజ్యోతి ప్రకటించిన 24 గంటల తర్వాత జగన్మోహన్‌రెడ్డీ సిగ్గులేదా అంటూ ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను గత ప్రభుత్వం నిలిపేయడాన్ని ఎండగట్టినట్టు అదే ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. దీన్ని బట్టి అన్న, చెల్లెళ్ల మధ్య సయోధ్య కుదరడంలేదని జర్నలిస్ట్ సాయి చెప్పిందే వాస్తవమైనట్టు ఉందని అంతా భావించారు. కానీ మూడు రోజుల పాటు పులివెందులలో బస చేయడానికి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి అదే సమయంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కూడా పులివెందులలోనే ఉండటం ఏదో జరగబోతోందనే సంకేతాలు అందిస్తున్నాయి. వైఎస్ షర్మిలతో జగన్మోహన్‌రెడ్డికి ఆస్తుల పంపకంలో విభేదాలున్నాయన్నది సుస్పష్టం. ఈ విషయాన్ని ఓపెన్ హార్ట్ విత్ ఆర్కేలో షర్మిల పేర్కొన్నారు. మరోవైపు జగన్మోహన్‌రెడ్డి మీడియాలో కూడా పరోక్షంగా ఇదే అంశాన్ని ఎన్నికల ముందు ప్రస్తావించారు. ఇప్పుడు ఆస్తుల పంపకం పద్ధతి ప్రకారం జరిగిపోతే, ఇక మిగిలింది జగన్మోహన్‌రెడ్డి మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరుతారా? లేదా అన్నదే ప్రధాన ప్రశ్న. సోనియా గాంధీని ఎదిరించి జైలుకు వెళ్లారు, జాగ్రత్త అని హెచ్చరించినా కూడా వెరవకుండా సొంత పార్టీని పెట్టుకున్న జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరరని సోషల్‌మీడియాలో ఆయన అభిమానులు పెద్ద ఎత్తున సమాచారం పెడుతున్నారు. బహుశా జగన్మోహన్‌రెడ్డి పోరాట శైలిని చూసి గతంతో పోల్చుకుని ఈమేరకు పోస్టులు పెడుతున్నారు తప్ప, ఇప్పుడు ఏదైనా జాతీయ పార్టీతో కలిసి ప్రయాణించాల్సిన పరిస్థితి ప్రాంతీయ పార్టీలకు ఉంది. అందుకు వైకాపా అతీతం మాత్రం కాదు. బీజేపీతోనే వచ్చే ఎన్నికలకూ కలిసి వెళ్తామని చంద్రబాబు ఇటీవల మరోసారి ఉద్ఘాటించడంతో మోడీకి ముద్దు బిడ్డ జగన్మోహన్‌రెడ్డి అనే టైటిల్ నుంచి జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికలకు దూరం జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్‌తో దోస్తీ కోసమేనా షర్మిలతో రాజీ అని ఆంధ్రజ్యోతిలో రాస్తే, భయమనేది ఆయన హిస్టరీలో లేదని, ఒక్కడే బయటకు వచ్చి టీడీపీని 23 సీట్లకు పంపాడని, ఓడి మళ్లీ 11 సీట్లకు వచ్చాడని, అయినా భయపడడంటూ సోషల్ మీడియాలో జగన్‌ను మోస్తున్నారు. మరోవైపు హర్యానాలో కాంగ్రెస్ ఓటమి తర్వాత ఐఎన్‌డీఐఏ కూటమిలో పార్టీలు మహారాష్ట్ర ఎన్నికల నాటికి ఉంటాయో ఊడుతాయో తెలియని పరిస్థితులు ఉన్నాయని, ఇటువంటి సమయంలో కాంగ్రెస్‌తో జగన్మోహన్‌రెడ్డి జతకట్టరని చెబుతున్నారు. జాగ్రత్తగా ఆలోచిస్తే ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డికి జాతీయ స్థాయిలో మద్దతు అవసరం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడ హత్యా రాజకీయాలు జరుగుతున్నాయంటూ ఢిల్లీలో ధర్నా చేసిన జగన్మోహన్‌రెడ్డికి పొలిటికల్ పార్టీ నుంచి వచ్చిన స్పందన అంతంత మాత్రమే. ఇప్పుడు బీజేపీ-టీడీపీ జతకట్టడం వల్ల రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ఒంటరైపోయారు. ఉన్నారో, లేరో తెలియకపోయినా కమ్యూనిస్టులు చంద్రబాబుతోనే వెళ్తారు. కాబట్టి ఇప్పుడు జాతీయ స్థాయిలో జగన్మోహన్‌రెడ్డికి అకామిడేషన్ కావాలి. అనేక రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు కూడా జాతీయ పార్టీ కాకపోతే కనీసం పొత్తు లేకపోయినా మట్టికొట్టుకుపోతామన్న సంకేతాలు ఇచ్చాయి. తెలంగాణలో పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ సీట్లు సర్దుకోగా, అక్కడ ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాకపోవడం ఇందుకు ఒక ఉదాహరణ. అలాగే ఒడిశాలో నవీన్ పట్నాయిక్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచినా, ఏ జాతీయ పార్టీ అండ లేకపోయినా ఓటు చీలిపోయి బీజేపీ అధికారంలోకి రాగలిగింది. ఇటువంటి అనేక సంఘటనలను దృష్టిలో పెట్టుకొని జాతీయ పార్టీతో అంటకాగాల్సిన పరిస్థితి జగన్మోహన్‌రెడ్డి పార్టీకి ఏర్పడింది. అయితే ఇందుకు షర్మిల ఆస్తుల పంపకాలు అయితేగానీ సహకరించరనేది మాత్రం ఉత్తిమాట. ఎందుకంటే.. ఈమధ్యే కాంగ్రెస్‌లోకి వెళ్లిన షర్మిల కంటే ముదుర్లు కాంగ్రెస్‌లో జగన్మోహన్‌రెడ్డి రాకను కోరుకుంటున్నారు. సోనియా నివాసం నుంచి రాకపోకలు సాగించే అనేకమంది జగన్మోహన్‌రెడ్డికి లైన్ క్లియర్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కాబట్టి ఆస్తులు పంచితేనే పార్టీలోకి రానిస్తారన్న మాట బహుశా సరికాకపోవచ్చు. ఏం జరిగిందో తెలియదు కానీ పులివెందులలో జగన్, షర్మిల బుధవారం భేటీ అవుతున్న సమయంలోనే కాంగ్రెస్ ఎంపీగా పనిచేసి, రాష్ట్ర మంత్రిగా చేసి, ప్రస్తుతం వైకాపా ఎమ్మెల్సీగా ఉన్న బొత్స సత్యనారాయణ మంగళవారం హుటాహుటిన ఢిల్లీ వెళ్లారు. బీజేపీతో 2014లో పొత్తులో ఉన్న చంద్రబాబు 2018 నాటికి తెలంగాణలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఇప్పటికీ అక్కడ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యుడే. అలాగే కర్ణాటకలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న, అక్కడి రాజకీయాలను శాసిస్తున్న శివకుమార్‌తో కూడా చంద్రబాబుకు మంచి సంబంధాలే ఉన్నాయి. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడానికి చంద్రబాబు అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుందేమో.

ఇటీవల హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిన తర్వాత జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆ పార్టీకి ఊరటనిచ్చింది. ఇక్కడ కూడా ఈవీఎంల వల్లే ఓడిపోయానని చెప్పుకుంటున్న జగన్మోహన్‌రెడ్డికి హర్యానాలో కూడా కాంగ్రెస్ ఇదే నినాదం చేయడంతో ఇప్పుడు కాంగ్రెస్, వైకాపాలు ఒక్క గొడుగు కిందకు వచ్చినట్టయ్యాయి. జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాలని భావిస్తున్నా దేశ రాజకీయాల్లో చుట్టూ అల్లుకుపోయిన చంద్రబాబు బిగి నుంచి దాటుకు వెళ్లడం అంత సులభం కాదు. ఎందుకంటే.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటే అందుకు ఫండింగ్ ఎవరు చేశారో, ఎక్కడి నుంచి చేశారో అందరికీ తెలుసు. 2019లో 151 సీట్లు వచ్చిన తర్వాత ప్రజలు తప్ప మరెవరూ అక్కర్లేదన్న భావనలో ఉన్న జగన్మోహన్‌రెడ్డిలో మార్పు రావడానికి కారణం కూడా ఆ ప్రజలే తప్ప మరొకరు కాదు.

• ఎడిటోరియల్

# ఆకలి భారతం..!

'చారిత్రక విభాత సంధ్యల మానవ కథ వికాసమెట్టిది?.. ఏ దేశం ఏ కాలంలో సాధించినదే పరమార్థం' అంటూ అంతిమంగా 'ఏ వెలుగులకీ ప్రస్థానం' అని ప్రశ్నించాడు శ్రీశ్రీ. ఈ ప్రశ్న దశాబ్దాలు గడిచినా మనల్ని వెంటాడుతూనే ఉన్నది. సమాజం వెలుగులవైపే ప్రయాణిస్తోందా? అని సదా హెచ్చరిస్తూ అప్రమత్తం చేస్తూనే ఉన్నది. ఇప్పుడు ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక నేపథ్యంలో మరోసారి మనలను తట్టిలేపుతున్నది. గురువారం వెల్లడించిన 'యూఎన్‌డీపీ' సూచీ ప్రపంచంలో 110 కోట్ల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో ఉన్నారని పేర్కొన్నది. ఇందులో అత్యధికులు మన దేశంలోనే ఉన్నారని కుండబద్ధలు కొట్టింది. ప్రస్తుతం ప్రజలు ఏం తినాలో ఏం తినకూడదో కూడా వారే తేల్చి చెపుతూ ఈ దేశ రాజకీయాలను ఎడతెరిపిలేకుండా 'అలరిస్తున్న' సనాతన ధర్మోపాసకుల ప్రవచనాలను కాసేపు పక్కన పెట్టి.. ఈ ఐక్యరాజ్యసమితి తాజా సూచీ వెలుగులో ప్రపంచాన్ని ఒక్కసారి తేరిపార చూస్తే.. అసలు తిండే దొరకని అన్నార్తుల ఆక్రందనలు మనలను కలవరపెడుతాయి. భయంకరమైన సంక్షోభాల ఊబిలో కూరుకుపోతున్న మానవాళి మనల్ని ఆందోళనకు గురిచేస్తుంది. మనుషులు అన్నపానీయాల కోసం అలమటించిన కాలమొకటి గతంలో ఉండేదంటే సరిపెట్టుకోవచ్చు. కానీ నేటి ఆధునిక యుగంలో సైతం ఇది కొనసాగుతుండటం సహించలేనిది. ఎందుకంటే.. ప్రపంచంలో ఇప్పటికే ఏటా కొన్ని వేల ట్రిలియన్ డాలర్ల సంపద ఉత్పత్తి అయి చలామణిలో ఉంటోంది. అది ప్రపంచ జనాభా మొత్తం కాలుమీద కాలేసుకుని తిన్నా కొన్ని వందల సంవత్సరాలకు సరిపోతుంది. అసలీ ఉన్న సంపదను వాడుకోకుండానే, అది ఏటా ఉత్పత్తి చేసే అదనపు సంపదే ప్రపంచ జనాభాకు కడుపునిండా అన్నం పెడుతుంది. అయినా నేడు సగం ప్రపంచం అర్ధాకలితో అలమటిస్తోంది. నూటా పదికోట్ల మంది దారుణమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ఎందుకు? సంపద పంపిణీలో అంతులేని దోపిడీ, ఫలితంగా నెలకొన్న తీవ్రమైన అసమానతలు అనాదిగా వెంటాడుతుండగా.. వాటికి తోడు యుద్ధాల ఫలితంగా తలెత్తే ఆహార సంక్షోభాలు ఈ ఆకలికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఘర్షణలు చెలరేగిన దేశాల్లో రోజుకు సుమారు 21 వేలమంది చొప్పున ఆకలికి తాళలేక ప్రాణాలు కోల్పోతున్నారన్న ఆక్స్‌ఫామ్ నివేదిక ఇందుకో తిరుగులేని ఉదాహరణ. నేడు ఇజ్రాయిల్, పాలస్తీనా వైపు చూస్తే ఏం కనిపిస్తోంది? రావణకాష్టంలా మండుతున్న మారణహోమంలో ఆయుధాల కంటే ఆకలికి బలవుతున్నవారే ఎక్కువ. ఇందులో మూడోవంతు మంది ముక్కుపచ్చలారని పసిపిల్లలు, మహిళలే. బాంబుల మోతల్లో అట్టుడికిపోతున్న గాజాలో 5 లక్షల మందికి ఆహారం అందడం లేదు. సూడాన్‌లో అంతర్యుద్ధం కారణంగా తీవ్రమైన ఆకలిచావులు సంభవించే ప్రమాదం పొంచివుందని పలు మానవతావాద సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే అక్కడ సుమారు ఏడున్నర లక్షల మంది ఆహారం కోసం అల్లాడుతున్నారు. ఇక ఉక్రెయిన్‌లో జరుగుతున్నదేమిటి? యుద్ధంలో అటూ ఇటూ మాటిమాటికీ చేతులు మారుతున్న ఆధిపత్యంలో ప్రతి ఊరూ, ప్రతి నగరం నేలమట్టమయ్యాకే వీరికైనా, వారికైనా స్వాధీనం అవుతోంది. వైరిపక్షాలు ఆహారాన్నీ, తాగునీటినీ, ఇంధనాన్నీ లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఫలితంగా బాధిత ప్రజలు ఆకలికి విలవిలలాడుతున్నారు. యుద్ధభూమి నుంచి వలసబాటలో సాగుతున్న లక్షలాది ప్రజలు కూడా ఆకలిచావులకే బలవుతున్నారు. ఇది ప్రత్యక్షంగా ఆయా దేశాల ప్రజలనే కాదు.. పరోక్షంగా మొత్తం ప్రపంచ దేశాల ప్రజలనూ ప్రభావితం చేస్తుంది. అందుకే ఇప్పుడు ఆకలి విశ్వమంతటా విలయతాండవం చేస్తున్నది. ఆయుధాలు ఎంత విధ్వంసం సృష్టించగలవో, అవి ఎంత కనికరం లేనివో మనం కళ్లారా చూస్తున్నాం. అంతకుమించి వాటి బేహారులు ఎంత నీచంగా నిప్పు చల్లారకుండా ఎగదోస్తున్నారో కూడా గమనిస్తూనే ఉన్నాం. వీరి నైచ్యానికి పాఠశాలలు, వైద్యశాలలు, గ్రంథాలయాల నుంచి పచ్చటి పొలాలు, నదులు, విద్యుత్ కేంద్రాలు, భారీ పరిశ్రమల దాకా సర్వం నేలమట్టం అవుతున్నాయి. ఈ కారణంగా తలెత్తే ఆహార సంక్షోభం రాబోవు తరాలను సైతం ఆకలి కోరలకు బలి చేయనుంది. చివరికి ఇదెక్కడికి దారితీస్తుంది? మానవజాతి మొత్తాన్ని ఈ నేల నుంచి తుడిచి పెట్టేస్తుందా? బతకడానికే పనికిరానిదిగా ఈ భూమండలం రూపురేఖల్ని మార్చేస్తుందా? స్టీఫెన్ హాకింగ్ చెప్పినట్టు కుబేరులంతా కలిసి పచ్చటి భూమిని చెత్తకుండీగా మార్చేసి, గ్రహాంతరాలకు ఉడాయించేస్తారా? అదే జరిగితే ఈ మానవజాతి సుదీర్ఘ నాగరికతా వికాసం ఏం సాధించినట్టు? 'గతమంతా తడిచె రక్తమున కాకుంటే కన్నీళ్లతో' అన్నాడు శ్రీశ్రీ. కానీ వర్తమానమూ అందుకు భిన్నంగా లేకపోవడం కడు విషాదం. ఇదిలాగే కొనసాగితే.. 2030 నాటికి ఆకలన్నదే లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని ఈ ప్రపంచం ఎలా సాధించగలదు?

## బంగారునాయుడుకు తల్లికి సత్కారం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంతర్గత భద్రతలో శత్రువులతో పోరాడి విధినిర్వహణలో అమరులైన ఎస్.బంగారునాయుడు ఎస్సై తల్లిని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ త్రినేత్రి సత్కరించారు. విజయనగరం జిల్లా డెంకాడ గ్రామంలో ఆయన స్వగృహంలో సోమవారం మహిళా పోలీసులు స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది బంగారునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన తల్లిని శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. ఆయన తల్లితో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## రామ్మూర్తి విగ్రహానికి నివాళి




(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

అమరవీరుల స్మారక ఉత్సవాల సందర్భంగా సోమవారం కంచిలి మండలం సాలినపుట్టుగ గ్రామంలో సాలిన రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి సోంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంగరాజు, కంచిలి ఎస్సై రాజేష్ నివాళులర్పించారు. రామ్మూర్తి తండ్రిని శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. 2008 సంవత్సరంలో బలిమెల ఇన్సిడెంట్‌లో పోలీసులు, మావోయిస్టుల మధ్యన జరిగిన కాల్పుల్లో శత్రువులతో పోరాడి ఏపీఎస్పీ ఆర్ఎస్ఐ రామ్మూర్తి వీరమరణం పొందారు. ఆయన త్యాగాలకు ప్రతిఫలంగా గ్రామంలో విగ్రహం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## డీఎస్సీ ఉచిత కోచింగ్ దరఖాస్తు గడువు పెంపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



త్వరలో వెలువడనున్న డీఎస్సీ 2024 పరీక్ష ఉచిత కోచింగ్‌కు ఈ నెల 25వ తేది వరకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు ఐటిడిఎ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకనూ దరఖాస్తు చేసుకోని గిరిజన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని పీవో కోరారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి తదితర సెంటర్లలో 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించబడును. అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు. ఇంతకు ముందు డీఎస్సీ కోచింగ్‌కు 2024 ఆగస్టు 22న ఐటిడిఎ స్థాయిలో నిర్వహించిన ఆఫ్‌లైన్ పరీక్ష రద్దయిందని, ఈ విషయాన్ని గిరిజన అభ్యర్థులు గమనించి, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## పాతపట్నంలో కొమరంభీమ్ జయంతి



(సత్యంన్యూస్, పాతపట్నం)

కొమరం భీమ్ 123వ జయంతి సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆదివాసి భవనంలో కొమరం భీమ్ విగ్రహానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, జిల్లా అధ్యక్షులు గురడి అప్పన్న పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కొమరం భీమ్‌ను స్మరించుకుంటూ భారతదేశంలో ఆదివాసీల హక్కుల కోసం జరిగిన పోరాటాలు చరిత్రాత్మకమైనవన్నారు. ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన కొమరం భీమ్ 'జల్-జంగిల్-జమీన్' నినాదానికి ప్రతీకగా నిలిచిపోయారని గుర్తుచేశారు. ఆదివాసీ ప్రజలకు అడవిపై హక్కు సామాజిక న్యాయంలో భాగమని నినదిస్తూ 1928 నుంచి 1940 వరకూ రణభేరి మోగించిన కొమరం భీమ్ నైజాం సర్కార్ గుండెల్లో సింహస్వప్నంగా మారారని యోగి అన్నారు. కొమరం భీమ్ అడుగుజాడల్లో నడవాలని గురడి అప్పన్న కోరారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ సభ్యులు జి.అప్పన్న, పి.సురేష్, జె.వాసు, శరత్, రామారావు తదితరులు భీమ్ విగ్రహానికి నివాళులర్పించారు.

## మనసుపెట్టి ఆడితే తెలివితేటలు పెరుగుతాయి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులు సమాజహిత అంశాలపై జ్ఞానం పెంపొందించుకోవాలని, చదరంగం క్రీడను మనసుపెట్టి ఆడటం వల్ల తెలివితేటలు పెరుగుతాయని వినియోగదారుల ప్రొటెక్షన్ రైట్ జిల్లా అధ్యక్షులు, సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా అన్నారు. ఇలిసిపురం ప్రాంతంలోని తిలక్‌నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో చిన్నారులతో సండే చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమంలో ఎజ్రా సతీమణి, నవోదయ విద్యాలయం ఉపాధ్యాయని అనీరోజ్, శ్రీ సాయిదుర్గా ట్యూషన్ సెంటర్



ప్రిన్సిపాల్ కె.ఉమారాణి, స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ చెస్ కోచ్‌లు భేరి చిన్నారావు, కె.సాయి నిరంజన్ సింగ్, చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఆ గొంతులో జీర..నాజల్ వాయిస్..

# అవే ఆ గళం ప్రత్యేకతలు!

(అక్టోబర్ 20 కుమార్ సాను పుట్టినరోజు సందర్భంగా..)

**"సాంసోం కీ జరూరత్ హై జైసే జిందగీ కే లియే**
**బస్ ఎక్ సనమ్ చాహియే ఆషికీ కే లియే!"**

**90స్ కిడ్స్‌కి పరిచయం అక్కర్లేని పాట ఇది. ఈ పాట పాడినవారికి కూడా పరిచయం అక్కర్లేదనుకోండి! దశాబ్దానికి పైగా బాలీవుడ్ సినీ సంగీతాన్ని ఏలిన మెలోడీ కింగ్ కేదార్ నాథ్ భట్టాచార్య ఉరఫ్ కుమార్ సాను పాడిన పాట ఇది. జీవితంలో మొదటిసారి ఎవరి గొంతుకతో అయినా ప్రేమలో పడ్డాను అంటే అది కుమార్ సాను గొంతుకే! నా స్కూల్ డేస్ లో రేడియోలో కుమార్ సాను పాటలు మొట్టమొదటిసారి వింటున్నప్పుడు ఇదీ అని చెప్పలేని అనుభూతి. కొన్నాళ్ళకు తెలియకుండానే అది నా ఫావరెట్ వాయిస్ గా మారింది. అంతకుముందు చాలా పాటలే విన్నా, చాలా గొంతుకలే విన్నా ఇది నా ఫావరెట్ అని ఎప్పుడూ అనిపించలేదు. నదీమ్-శ్రవణ్ జోడీతో కలిసి కుమార్ సాను పాటలు పాడిన కాలాన్ని బాలీవుడ్‌కి స్వర్ణ యుగంగా చెప్పకోవచ్చు. 'ఆషికీ'లో ప్రతి పాటా ఎన్ని వందలసార్లు విన్నా ఎప్పటికీ పాతబడదు. 'సాంసోంకీ జరూరత్', 'తూ మేరీ జిందగీ హై', 'నజర్ కే సామ్ నే' ఎంత మెలోడీయస్ గా ఉంటాయో 'అబ్ తేరే బిన్' అంత ఆవేశపరుస్తుంది. కాబట్టే ఈ పాట కుమార్ సానుకి ఫిలింఫేర్ అవార్డు తెచ్చి పెట్టింది. 1991లో ఈ పాటకుగాను మొదటిసారి ఫిలింఫేర్ అవార్డు అందుకున్న కుమార్ సాను వరసగా ఐదేళ్ళు, అంటే 1995 వరకు ఈ అవార్డు అందుకుంటూనే ఉన్నారు. 'సాజన్'లోని 'మేరా దిల్ భీ కిత్నా పాగల్ హై' కుమార్ సాను ఫిలింఫేర్ అవార్డు గెలుచుకున్న పాటల్లో ఒకటి. 'సాజన్' పాటలంటే ప్రాణం పెట్టే నాకు ఈ పాటంటే మరీ ప్రేమ. అది కుమార్ సాను వల్లే అని వేరే చెప్పాలా?**

మన తెలుగులోనూ కుమార్ సాను 'దేవుడు వరమందిస్తే', 'మెరిసేటి జాబిలి నువ్వే', 'ఒక్కసారి చెప్పలేవా' లాంటి హిట్ సాంగ్స్ పాడారు. 2004లో పాలిటిక్స్ లోకి వెళ్ళిన కుమార్ సాను ఎనిమిదేళ్ళ తర్వాత మళ్ళీ సినిమాల్లోకి తిరిగి వచ్చారు. 'రౌడీ రాథోడ్', 'గన్స్ & గులాబ్స్' లాంటి సినిమాల్లో పాడారు. అక్టోబర్ 20, 1957లో పుట్టిన కుమార్ సానుకి ఇప్పుడు 67 ఏళ్ళు. ఈ వయసులోనూ ఆయన గొంతు ఏమాత్రం చెక్కుచెదరలేదు. ఈ మధ్యనే 'కుమార్ సాను అఫీషియల్' పేరుతో యూట్యూబ్‌లో ఆయన సొంత మ్యూజిక్ లేబుల్ ఒకటి ప్రారంభించారు. అందులోని పాటలు వింటే ఈ విషయం అర్థమవుతుంది.

1995కిగాను 'ఎక్ లడ్కీ కో దేఖా తో' (1942 ఎ లవ్ స్టోరీ) అనే పాట కుమార్ సానుకి ఫిలింఫేర్ సాధించింది. ఆర్డీ బర్మన్ చివరిసారిగా కంపోజ్ చేసిన ఈ పాట కుమార్ సాను జర్నీకి ఒక క్లాసిక్‌టచ్ ఇచ్చింది. సంగీతం, స్వరం, విధు వినోద్‌చోప్రా పిక్చరైజేషన్‌తో పాటు జావేద్ అఖ్తర్ లిరిక్స్ వల్ల ఈ పాట అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. ఇదే సినిమాలో కుమార్ సాను పాడిన 'కుఛ్ నా కహో' చాలా హాయిగా అనిపిస్తుంది. గొంతులో ఒక రకమైన జీరతో, నాసల్ వాయిస్‌లో పాడే కుమార్ సాను మెలోడీస్ వింటే చాలు అప్పట్లో సంగీత ప్రియుల గుండెలు విలవిల్లాడిపోయేవి. 'దిల్ హై కె మాన్తా నహీ' టైటిల్ సాంగ్, 'తుమ్హే అప్నా బనానే కీ కసమ్' (సడక్), 'ధీరే ధీరే ప్యార్ కో బఢానా హై' (ఫూల్ ఔర్ కాంటే), 'గవా హై చాంద్ తారే' (దామిని), 'సోచేంగే తుమ్హే ప్యార్ కర్నే నహీ' (దీవానా), 'ఘూంఘట్ కీ ఆడ్ సే' (హమ్ హై రాహీ ప్యార్ కే), 'పర్ దేసీ జానా నహీ' (రాజా హిందూస్తానీ), 'దో దిల్ మిల్ రహే హై', 'మేరీ మెహబూబా' (పర్ దేస్)– ఇలా నదీమ్–శ్రవణ్ స్వరపరిచిన పాటలను కుమార్‌సాను తన గొంతుకతో ఎవర్ గ్రీన్ హిట్స్‌గా మలిచారు. మొత్తమ్మీద ఈ జోడీ కాంబినేషన్‌లో కుమార్ సాను 300 దాకా పాటలు పాడారు.

నదీమ్ శ్రవణ్ తర్వాత కుమార్‌సాను ఎక్కువగా పని చేసింది అను మల్లిక్‌కే అయినా నా ఫేవరెట్ కాంబో మాత్రం జతిన్–లలిత్‌తోనే! 'దిల్‌వాలే దుల్హానియే లే జాయింగే' కోసం కుమార్‌సాను లతా మంగేష్కర్‌తో కలిసి పాడిన 'తుఝే దేఖా తో యే జానా సనమ్' ఇప్పటికైనా ఎప్పటికైనా మర్చిపోగలమా? 'సీనే మే దిల్ హై', 'తు మేరే సాథ్ సాథ్ హై' (రాజు బన్ గయా జంటిల్ మ్యాన్), 'ఐ కాష్ కే హమ్' (కభీ హా కభీ నా) 'ఏక్ దిన్ ఆప్' (యస్ బాస్) లాంటి పాటలు షారుఖ్ ఖాన్ కెరీర్‌లో మైలురాళ్ళ లాంటి పాటలు. 'దుష్మన్' కోసం లతా మంగేష్కర్ తో కలిసి పాడిన 'ప్యార్ కో హెూ జానే దో' నాకు బాగా ఇష్టమైన పాటల్లో ఒకటి. కానీ జతిన్ లలిత్ కాంబినేషన్ లో కుమార్ సాను పాడిన 'జబ్ కిసీ కీ తరఫ్' (ప్యార్ తో హెూనా హీ థా) నా ఆల్ టైం ఫావరెట్స్ లో ఒకటి. ఈ కాంబోలో ఇంత కంటే ఇష్టమైన మరోటి ఉంది. అదే 'ఖూబ్ సూరత్'లోని 'మేరా ఎక్ సప్నా హై'! కవితా కృష్ణమూర్తితో కలిసి కుమార్ సాను పాడిన ఈ పాట వింటే కలల్లో తేలిపోవడం ఖాయం. అను మల్లిక్ కాంబినేషన్ లో 'బాజీగర్' కోసం కుమార్ సాను పాడిన 'యే కాలీ కాలీ ఆంఖే' ఫిలింఫేర్ సాధించుకుంది. అనుమల్లిక్ స్వర కల్పనలో కుమార్ సాను 'చురాకే దిల్ మేరా' లాంటి ఎన్ని హిట్ నంబర్స్ పాడినా నాకు బాగా నచ్చేది మాత్రం 'దిల్ జలే' లోని 'జిస్కే ఆనే సే' పాట. లిరిక్స్, కంపోజిషన్ పరంగా ఇది 'ఎక్ లడ్కీ కో దేఖా తో' పాటను పోలి ఉన్నా దానికి వచ్చినంత గుర్తింపు అయితే రాలేదు. కానీ కుమార్ సాను పాడిన పాటల్లోకి నాకిది చాలా ఇష్టమైన పాట.

1990ల నాటి బ్యాక్ గ్రౌండ్ తో ఆయుష్మాన్ ఖురానా, భూమి పడ్నేకర్ హీరో హీరోయిన్లుగా 2015లో వచ్చిన సినిమా 'దమ్ లగాకే హైషా'. 90ల నాటి సినిమా గనక నేచరల్‌గానే ఇందులోని హీరో హీరోయిన్లకు కుమార్ సాను పాటలంటే పిచ్చి అన్నట్లు చూపిస్తారు. ఈ సినిమాలో అను మల్లిక్, కుమార్ సానుతో రెండు పాటలు పాడించారు. ఒక పాటలో ఆయన కేమియో అప్పియరెన్స్ కూడా ఇచ్చారు. 'జబ్ కోయి బాత్ బిగడ్ జాయే' జుర్మ్ సినిమా కోసం రాజేశ్ రోషన్ మ్యూజిక్ డైరెక్షన్‌లో కుమార్ సాను పాడిన ఈ పాట ఎవర్ గ్రీన్ హిట్. ఆ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్ లో 'కరణ్ అర్జున్', 'సబ్సే బడా ఖిలాడీ', 'కోయ్ లా', 'క్యా కెహ్ నా' లాంటి సినిమాలు వచ్చాయి. ఇక 'కహెూ నా ప్యార్ హై'లో కుమార్ సాను పాడిన 'చాంద్ సితారే' చాలా ఎలిగెంట్‌గా అనిపిస్తుంది. ఉదిత్ నారాయణ్ లాంటి సింగర్స్‌తో ఎన్నో పాటలు పాడించిన రెహమాన్, కుమార్ సానుతో ఒకే ఒక్క పాట పాడించడం జీర్ణం కాదు. 'కభీ న కభీ' లో 'మిల్ గయీ మిల్ గయీ' అనే ఈ పాట 'అంజలి అంజలి పుష్పాంజలి' అనే పాట ట్యూన్‌లో సాగుతుంది. ఒక ఇంటర్వ్యూలో రహమాన్‌ని అసలు మ్యూజిక్ డైరెక్టర్ గానే గుర్తించను అని కుమార్ సాను చెప్పారు. ఎందుకని అడిగితే ఆయన నన్ను సింగర్‌గా గుర్తించలేదు కాబట్టి అని సమాధానమిచ్చారు. ఈ మాటలు వింటే ఇద్దరికీ ఎక్కడో కుదరలేదని అర్థమవుతుంది.

కుమార్ సాను లతా మంగేష్కర్, అను రాధా పౌడ్వాల్, సాధనా సర్గమ్ లాంటి సింగర్స్ తో కలిసి ఎన్ని పాటలు పాడినా అల్కా యాగ్నిక్ తో ఆయన పాడిన పాటలు వింటే తేనెలో ముంచి తేల్చినట్లుగా ఫీలయ్యేది మా జనరేషన్! 'బాజీగర్ ఓ బాజీగర్', 'ముఝ్ సే మొహబ్బత్ కా', 'యే ఇష్క్ హై క్యా', 'తేరీ మొహబ్బత్ నే', 'హమ్ కో సిర్ఫ్ తుమ్ సే ప్యార్ హై', 'జాదూ హై తేరా హీ జాదూ', 'జో హాల్ దిల్ కా' లాంటి పాటలు ఈ కాంబినేషన్ కి కొన్ని ఉదాహరణలు.

కుమార్ సాను మాతృభాష అయిన బెంగాలీతో పాటు హిందీ, తెలుగు సహా 16కి పైగా భాషల్లో పాటలు పాడారు. ఒకే రోజు 28 పాటలు పాడిన గాయకుడిగా గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించుకున్నారు. బీబీసీ రూపొందించిన 'ఆల్ టైం 40 సాంగ్స్ ఆఫ్ బాలీవుడ్'లో కుమార్ సాను పాటలే ఎక్కువగా కనిపిస్తాయి. 2009లో పద్మశ్రీ అందుకున్నారు.

ఈమధ్య కాలంలో కేకే, అరిజీత్ సింగ్, మోహిత్ చౌహాన్, పపోన్ లాంటి సింగర్స్ పాటలు నాకు బాగా నచ్చుతున్నాయి. కానీ చైల్డ్‌హుడ్ లవ్ ఎన్నటికీ మర్చిపోలేం కదా! అందుకే ఇలా అప్పుడప్పుడు తలుచుకోవడం!

కుమార్ సానుకి లెజెండరీ సింగర్ కిశోర్ కుమార్ అంటే గొప్ప గౌరవం. 1983లో సాను భట్టాచార్యగా బెంగాలీలో సింగింగ్ కెరీర్ ఆరంభించిన కేదార్ నాథ్ భట్టాచార్య, 1988లో 'హీరో హీరాలాల్' అనే హిందీ సినిమాలో తొలిసారి పాడారు. 1989లో జగ్ జీత్ సింగ్ ఆయన్ను కల్యాణ్ జీ–ఆనంద్ జీ జోడీలోని కల్యాణ్ జీకి పరిచయం చేశారు. వాళ్ళ సూచనతో కిశోర్ కుమార్ పేరులోని కుమార్ కి 'సాను' కలిపి కుమార్ సాను గా తన పేరు మార్చుకున్నారు. అంతే కాదు 'కిశోర్ కుమార్ కీ యాదే' పేరుతో కిశోర్ దా పాపులర్ సాంగ్స్ పాడుతూ ఒక ఆల్బమ్ కూడా రిలీజ్ చేశారు.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...





అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల బెద్దమ్మ, సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ దుర్గ, మాయమ్మ, కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్! అమ్మలనుకన్న దేవతా స్త్రీలయిన వారి మనస్సుల యందు ఏ అమ్మవారు ఉన్నదో అటువంటి అమ్మకు నమస్కరిస్తూ.. మహాకాళీ, సరస్వతీ, మహాలక్ష్మిని కన్నతల్లిని చాలా బెద్దమ్మగా, అండపిండ బ్రహ్మాండ మహాశక్తిగా కొలిచారు పోతానామాత్యుడు. అయితే, ప్రస్తుత నాగరిక సమాజంలో అలా కొలవాల్సిన ఓ తల్లి గురించి మనం చెప్పుకోబోతున్నాం.


**పోషకాహార లోపంతో బాధపడుతూ చిన్ననాటే తల్లులకు దూరమైన ఎందరో పిల్లలకు తన చనుబాలిచ్చిన ఓ తల్లి కథ కృష్ణుణ్ని లాలించిన యశోద కన్నా గొప్పది. మధ్యయుగంలోని 16వ శతాబ్దానికి చెందిన రాజస్థాన్‌లోని రాణా సంగా కుమారుడు ఉదయ్ సింగ్‌ను లాలించిన పరిచారిక పన్నా దై కథను మించింది. అందుకే ఆ రాజస్థానీ రక్షాజైన్‌ను అమ్మల గన్న అమ్మగా చెప్పుకుంటున్నాం.**

# ఆకలిగొన్న పసిపెదాలకు అమృతధార!

టెక్స్ టైల్స్ ఆఫ్ ఇండియాగా, మాంచెస్టర్ ఆఫ్ రాజస్థాన్‌గా పిల్చుకునే బిల్వారాకు చెందిన రక్షాజైన్ మానవీయకోణం మాటలకందేది కాదు. వివిధ కారణాల వల్ల తల్లిపాలందని నవజాత శిశువులెందరి పాలిటో ఆమె చనుబాలిచ్చిన అమ్మైంది. అమ్మలగన్న అమ్మగా ఆకలిగొన్న పసిపెదాలకు క్షీరధారైన తల్లిగా ఆమె పేరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కెక్కింది. అన్నదానం, నేత్ర దానం, అవయవదానం, నీళ్లదానం, రక్తదానం ఇలా ఎన్నో గొప్ప గొప్ప దానాల గురించి విన్న మనకు చనుబాల దానం గురించి విన్నప్పుడు అందుకు ఓ తల్లికెంత పెద్ద మనస్సుండాలి? ఆమె అలా తన చనుబాలను నవజాత శిశువులకిస్తానంటే.. అందుకు ఒప్పుకున్న ఆ కుటుంబీకులది ఇంకెంత గొప్ప హృదయమై ఉండాలి..? వృత్తిరీత్యా ఎలక్ట్రో థెరపిస్ట్‌గా పనిచేసే రక్షాజైన్ ఇద్దరు పిల్లల తల్లి. 2018 జూన్ 17న తన కుమారుడికి జన్మనిచ్చిన తర్వాత ఆమెకు మూడురోజుల పాటు పాల ఉత్పత్తి కాకపోవడంతో ఆ తల్లి మనస్సు తల్లడిల్లింది. దాంతో మహాత్మాగాంధీ ఆసుపత్రిలో ఆంచల్ మదర్ మిల్క్ బ్యాంకు నుంచి సాయం కోరింది. తనకు ఆ సమయంలో తక్షణ సాయమైతే అందిందిగానీ.. తన బిడ్డడి లాగా ఎందరు బిడ్డలు ఇలా ఇబ్బందులు పడుతున్నారోనన్న ఒకింత కలవరం, బాధ రక్షాజైన్‌ను మథనంలో పడేశాయి. అదిగో అప్పుడే అలాంటి పిల్లలకు ఏదైనా చేయాలన్న సంకల్పం ఆమెలో మొదలైంది. ఆంచల్ మదర్ మిల్క్ బ్యాంకు నుంచి వచ్చిన పాలే తన బిడ్డను రక్షించాయని తెలుసుకున్న రక్షాజైన్.. తన బిడ్డలాగా సవాళ్ల నెదుర్కొంటున్న నవజాత శిశువులకు తానూ చనుబాలిచ్చేలా తనకు సహకరించాలని ఆ దేవుణ్ని వేడుకున్నానని చెప్పింది. రక్ష ప్రార్థన ప్రశ్నగానే మిగిలిపోకుండా.. సమాధానం లభించింది. అయితే, చనుబాల వితరణకు పూనుకున్న రక్ష మనస్సు గొప్పదే కావచ్చు. క్షీరదానం మరింత గొప్పగానే కనిపించొచ్చు. కానీ, ఆ పెయిన్ వర్ణించలేనిది. శారీరకంగా వచ్చే బాధలనూ అధిగమించాల్సి ఉంటుందన్న హెచ్చరికలనూ బేఖాతరు చేసింది. ఎందుకంటే మరొక తల్లి పాలు తన బిడ్డను రక్షించి ప్రాణభిక్ష పెట్టినప్పుడు.. తన బిడ్డలాంటి ఎందరో అవసరార్థులకు తానెందుకివ్వకూడదన్న ఓ గొప్ప ఆలోచన, సంకల్పం రక్షాజైన్‌ను ఎందరో నవజాత శిశువుల పాలిట మహాతల్లిగా మార్చేసింది. రాజస్థాన్ వంటి ఎడారి ప్రాంతంలో ఎందరో బిడ్డల ఆకలి తీర్చిన అమ్మై.. సాటి మనిషి పట్ల జీవకారుణ్యాన్ని ప్రదర్శించిన తీరే రక్షాజైన్‌ను ఓ గొప్ప కథగా మార్చింది. 2018, జూన్ 20వ తేదీ నుంచి రక్ష క్రమం తప్పకుండా తన చనుబాలను దానం చేస్తూనే ఉంది. ఒక సిట్టింగ్‌లో లీటరు వరకు పాలను అందజేస్తూనే ఉంది. మదర్ మిల్క్ బ్యాంక్ వద్ద ఉన్న రక్షా జైన్ అనే ఒక



తల్లి ఇచ్చిన పాల లెక్క మొత్తం చూస్తే ఆశ్చర్య పోతాం. రక్షాజైన్ ఇప్పటి వరకూ 5వేల మంది పిల్లలకు అవసరమైన 160 లీటర్లకు పైగా పాలనిచ్చి మహాతల్లిగా కీర్తికెక్కింది. తన మొదటి ప్రసవం తర్వాత 2018 జూన్ నుంచి 2019 వరకు ఆంచల్ మదర్ మిల్క్ బ్యాంకుకు 54 లీటర్ల పాల నందించింది. రెండవ డెలివరీ అనంతరం 2023, నవంబర్ 14 వరకూ మరో 106 లీటర్లకు పాలందించింది. తన ఫస్ట్ డెలివరీ సమయంలో రక్ష అత్తమామల ఇంట్లో ఉంటూనే ప్రతీరోజూ బిల్వారా పట్టణానికి రూ.700 రానుపోను ఖర్చులు భరిస్తూ వెళ్లివచ్చేంది. రోజూవారీ ట్యాక్సీ ఖర్చులు పెరగడంతో చాలాసార్లు తన స్కూటీపై వెళ్లి మదర్ మిల్క్ బ్యాంకులో పాలిచ్చి వచ్చేది. అలా వెళ్లే సమయంలో తన నెలన్నర చిన్న కుమారుణ్ని తన ఛాతీకి భద్రంగా కట్టుకుని ప్రయాణించేది.



ప్రసవ సమయంలో ఓ ఆసుపత్రిలో ఓ తల్లి చనిపోయి బిడ్డ బతికిన ఘటనలో రక్షాజైన్ పాలతోనే ఆ బిడ్డ బతికి పెరిగి పెద్దదైన కథను ఆసుపత్రి వర్గాలు తనకు చెబుతుంటే తన కళ్లు చెమర్చాయంటుంది రక్షాజైన్. ఆ అమ్మాయిని తన చేతుల్లోకి తీసుకుని లాలిస్తూ.. అమ్మ లేకపోతేనేం నేనున్నానుగా అన్న ఆమె హృదయస్పందన విన్నవాళ్లకు, ప్రత్యక్షంగా చూసినవాళ్లకు.. పోతానామాత్యుడు చెప్పినట్టుగా ముగ్గురమ్మల మూలపుటమ్మలా ఆ అమ్మ కనిపించదూ! ఆకలి తీర్చేందుకు తన స్తన్యాన్నిచ్చిన ఆ అమ్మకు ఇప్పుడెందరో బిడ్డలు రుణపడి ఉన్నారు. అందుకే, రక్షాజైన్ ఓ వార్తకొక శీర్షిక కాదు.. నేటి మెకానికల్ లైఫ్‌లో పిల్లలకు డబ్బా పాలిచ్చి పెంచే ఎందరో తల్లులు తెలుసుకోవాల్సిన ఓ కథ. అక్షరాల్లో, మాటల్లో వర్ణించలేని నిస్వార్థకతకు, అమృతతుల్యమైన ప్రేమకు ఓ ప్రతీక. తన రెండో బిడ్డ జన్మించాక మళ్లీ మూడు రోజుల తర్వాతే వెంటనే తన పాల వితరణను ప్రారంభించిందే తప్ప.. ఇక చాలనుకోలేదు. ఎందుకంటే ఆమె సంకల్పంలో అంకితభావముంది. అలాంటి మహాసంకల్పం కలిగి ఉండటమే రక్షాజైన్‌ను మహాతల్లిని చేసింది. ఇప్పుడు రక్షాజైన్ కథ రాజస్థాన్ ఎడారికో, కేవలం మన దేశానికో మాత్రమే పరిమితమైంది కాదు. ఎల్లలు లేని కీర్తికి ఆమె హృదయస్పందన సాధించిన కచ్చితమైన అర్హత. భిల్వారా చుట్టుపక్కలే కాకుండా.. అజ్మీర్ వంటి పొరుగు జిల్లాల్లోనూ ఆమె పాల వితరణ ఎందరో పిల్లలకు పౌష్టికాహారమైంది. తన పాల వితరణలో భర్త సునీల్, తల్లి శారదాదేవీ, సోదరుడు రాహుల్ సోనీ పాత్రల్లేకుండా.. తన సాయం పూర్తయ్యేది కాదనీ వారికీ తన కీర్తిలో స్థానాన్నిస్తోంది రక్షాజైన్. సోదరుడు ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు, మదర్ మిల్క్ బ్యాంకుకు తీసుకెళ్లేందుకు సాయపడితే, తల్లి ఇంటి పనులు చూసుకుంటూ తనకు బాసటగా నిల్చేదని చెబుతుందామె. అయితే, తనను చాలామంది భయ పెట్టినట్టు తనకేమీ ఇబ్బంది లేదని.. తాను ఆరోగ్యంగా ఉన్నానంటోంది రక్ష. తన పాలు తాగి పెరిగి పెద్దయిన ఎందరో పిల్లలకు తల్లయిన ఘనత తనకు దక్కడం మాటల్లో చెప్పలేని అనుభూతిని, జీవన సంతృప్తి నిచ్చిందంటోందామె. తన స్ఫూర్తిని మరింత మందిలో పెంచే ఒక మిషన్‌నూ రక్షాజైన్ చేపట్టింది. తనలాంటి సామాజిక స్పృహ ఉన్న మహిళలెందరినో కలుపుకుని.. లైఫ్ వెల్ఫేర్ పింక్ స్క్వాడ్ అనే సొసైటీని ఏర్పాటు చేసింది. ప్రారంభంలో చాలామంది మహిళలు రక్షలాగా పాలివ్వడానికి నిరాకరించారు. కానీ, రక్ష స్ఫూర్తి రగిలించడంలో మెల్లిమెల్లిగా సక్సెస్ అవ్వడంతో ఇప్పుడు 20 మంది మహిళలతో పోషకాహార లోపంతో బాధపడే శిశువుల సంరక్షణ కోసం తల్లిపాల బ్యాంకునే ఏర్పాటు చేసింది రక్ష. బిల్వారాలోని మహాత్మాగాంధీ హాస్పిటల్‌కు అనుసంధానంగా ఉన్న ఆంచల్ మదర్ మిల్క్ బ్యాంక్ అప్పుడే ప్రసవించిన మహిళల నుంచి మిగులుపాలను సేకరించి ఓ తల్లిపాల బ్యాంకునేర్పాటు చేసింది. ఒకసారి ఒక మహిళ నుంచి 150 మిల్లీలీటర్ల పాలను సేకరిస్తారు. ఆ పాలను పాశ్చరైజ్ చేసి ఆరునెలల వరకు ఫ్రీజర్‌లో సురక్షితంగా నిల్వ చేస్తారు. అనాథ శిశువులు, తల్లిపాలు సరిగ్గా అందని పిల్లలకు వైద్యుల ప్రిస్క్రిప్షన్ ప్రకారం అందజేస్తారు.

అమ్మతనం తనకుందని అవని పొంగిపోతుంది.. అమ్మను కాలేనే అని ఆకాశం కుములుతుంది అన్నారు ఓ పాటలో సినారె. అదిగో అలాంటి పొంగిపోయే అమ్మతనాన్ని రక్షాజైన్‌లో దర్శించొచ్చు. మొత్తంగా నిస్వార్థం, దాతృత్వం, తల్లి ప్రేమ, సమాజసేవ, అంకితభావం, సంకల్పం, రక్షణ, కరుణరసం ఇలా ఇన్ని పదాల పర్యాయపదం.. ఎడారి దారుల్లో పసిబిడ్డలకు జీవనరక్షైన రక్షాజైన్.

- రమణ కొంటికర్ల



# మునకాలలకు ఉత్తమ ఎడిటర్ అవార్డు

**భువనేశ్వర్ జైదేవ్‌భవన్‌లో అవార్డు అందజేత । సిక్కోలు యువకెరటానికి ఏడాదిలో రెండు పురస్కారాలు**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

భువనేశ్వర్ జైదేవ్‌భవన్‌లో ఇటీవల ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ద ఒరిస్సా అవార్డుల మహోత్సవం సినీ ప్రముఖుల మధ్య నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాల వ్యక్తులు పాల్గొన్నారు. తెలుగు, ఒడిస్సా, హిందీ బెంగాలీ, కన్నడ చిత్రాలకు అవార్డులు లభించాయి. ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ ప్రతినాయకుడు, బెస్ట్ కొరియోగ్రాఫర్, బెస్ట్ వీడియో ఎడిటర్, ఉత్తమ చిత్రాలకు అవార్డులు లభించాయి. తెలుగు నుంచి ఎంపికైన పలు చిత్రాలలో గురుకులం చిత్రానికి మన సిక్కోలు యువ కెరటం మునకాల గోవిందరెడ్డి ఉత్తమ ఎడిటర్ అవార్డు అందుకున్నారు. ఇదే సంవత్సరంలో హైదరాబాదులో ఆదర్శ కళా నిలయం స్వర్ణ నంది పురస్కారం, 2024 అవార్డు. (గ్రాఫిక్స్ డిజైనర్, ఎడిటర్. ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ) గోవింద్ రెడ్డికి స్వర్ణనంది అవార్డు



వరించింది. ఒక ఏడాదిలో రెండు అవార్డులు గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉందని గోవింద్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం తెలిపారు. సినీ పరిశ్రమలో మరింత పేరు సంపాదించాలని, మరెన్నో అవార్డులు గెలుచుకొని జిల్లాకు, రాష్ట్రానికి మంచి గుర్తింపు తేవాలని కోరారు. గోవింద్ రెడ్డి తండ్రి మునకాల కిరణ్‌రెడ్డి ఇండియన్ ఆర్మీలో 26 సంవత్సరాలు మిలటరీ ఇంజనీర్స్ విభాగంలో సర్వీస్ చేసి జేసీవో హోదాలో పదవి విరమణ చేశారు. తమ అబ్బాయి మరింత ఉత్సాహంతో గ్రాఫిక్స్ డిజైన్స్ విభాగంలో మరిన్ని మెలికలు నేర్చుకొని మరిన్ని ఉత్తమ చిత్రాలకు పని చేయాలని ఆకాంక్షించారు.

# నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సాగునీటి సంఘాల ఎన్నికలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 344 సాగు నీటి సంఘాలను గుర్తించారు. ఇప్పటికే ఆయా మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ సంఘాల పరిధిలో ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో నిర్ధారించిన ఆయకట్టు కింద ఉన్న సర్వే నెంబర్ల వారీగా జాబితా నవీకరించాలని నీటిపారుదల శాఖ అధికారులు వాస్తవ ఆయకట్టుదారుడెవరనే వివరాలను క్షేత్రస్థాయి రెవెన్యూ యంత్రాంగం సహాయంతో సేకరిస్తున్నారు. చేర్పులు, మార్పులు, అన్ని అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత తుది ఎన్నికల ఓటరు (రైతులు) జాబితాను వచ్చే నెల 13న ప్రచురిస్తారు. నవంబర్ 21 నుంచి 27 వరకు జరగనున్న ఈ ఎన్నికలకు సంబంధించి 344 సంఘాలకు పూర్తిస్థాయి సమాచారం అందజేస్తున్నారు. సోమవారం నుంచి 40 రోజుల పాటు ఈ సాగునీటి ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. సాగునీటి సంఘాలు వారి పరిధిలోని పంట కాలువల అభివృద్ధి, నీటి సరఫరా తీరుతెన్నులు పర్యవేక్షించడంతో పాటు ఆయకట్టు పరిధిలో ఏ సమస్య వచ్చినా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయి. చివరగా 2015లో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు.

# 25న మినీ జాబ్‌మేళా

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఫెయిల్ లేదా పాస్, ఐటీఐ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ కల్పనలో భాగంగా 'మినీ జాబ్‌మేళా' బలగ ప్రభుత్వ డిఎల్‌టీసి/ఐటిఐ కాలేజీలో ఈ నెల 25న ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఉద్యోగ మేళాలో మోడలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్.ఎస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కాల్గేట్, పాలమొలివ్, అపోలో టైర్స్ వంటి నాలుగు బహుళజాతి కంపెనీలు పాంటాయని, అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికచేస్తారని తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత విద్యార్హత, ఆధార్‌కార్డు నకలు, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాయికుమార్ కోరారు. ఇతర వివరాలకు 70957 31303, 83176 52552 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

























# ఊరు మనదే తోసెయ్!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామకంతాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. మెళియాపుట్టి మండలం మర్రిపాడు(సి) బంజరు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 290లో 0.53 సెంట్లు గ్రామకంతాన్ని గ్రామానికి చెందిన హనుమంతు లింగరాజు, సంజీవమ్మ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. తహసిల్దార్ కార్యాలయం స్టాంపులు తయారు చేసి, తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి పొజిషన్ సర్టిఫికెట్ను సృష్టించి కోటబొమ్మాళి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వారసత్వంగా చూపించి రిజిస్ట్రేషన్ చేసినట్టు వెలుగులోకి వచ్చింది. రేఖా సంఖ్య 45/2024తో ఈ ఏడాది జనవరి 22న తహసిల్దార్ కార్యాలయం నుంచి ఎండార్స్‌మెంట్ ఇచ్చినట్టు ఫోర్జరీ పొజిషన్ సర్టిఫికెట్‌తో హనుమంతు జీవనరావు పేరున జనవరి 25న డాక్యుమెంట్ నెంబర్ 249/2024తో కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. రేఖా సంఖ్య 65/2024లో జూలై 16న తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ జారీ చేసినట్టు చూపించి రెండు ఫోర్జరీ పొజిషన్ సర్టిఫికెట్లతో హనుమంతు లింగరాజు పేరుతో జూలై 24న డాక్యుమెంట్ నెంబర్ 3751/2024తో, హనుమంతు సహదేవుడు పేరుతో జూలై 29న డాక్యుమెంట్ నెంబర్ 3828/2024న కోటబొమ్మాళిలో రిజిస్ట్రేషన్ చేశారు. వాస్తవంగా సర్వే నెంబర్ 290లో ఉన్న గ్రామకంతాన్ని తూర్పు భాగంలో ఉన్న సర్వే నెంబర్ 289/3లో ఉన్న జిరాయితీ మెట్టభూమిగా చూపించి ముగ్గురి పేరున రిజిస్ట్రేషన్ చేసినట్టు గ్రామానికి చెందిన ఆరుగురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండల సర్వేయర్ రిపోర్టు ఆధారంగా ప్రభుత్వ భూములను సొంతం చేసుకున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. గ్రామకంతంలో 1997లో నిర్మించిన తమ్మినేని వనజాక్షి డాబా ఇల్లు ఉంది. దీన్ని ఆ ముగ్గురు తమకు చెందినట్టుగా చూపించి స్వాధీనం చేసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 289/3పై జేసీ కోర్టులో ప్రస్తుతం వివాదం నడుస్తుంది. 2017లో అప్పటి మెళియాపుట్టి తహసీల్దారు జాలారి చలమయ్య హయాంలో గ్రామానికి చెందిన సాంబయ్య దీన్ని వారసత్వంగా సంక్రమించిందని రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసి ఈ-పాస్ పుస్తకాలను సంపాదించగలిగారని, ఫోర్జరీ ధ్రువపత్రాలతో డాక్యుమెంట్లను సృష్టించినట్టు ఆరోపిస్తున్నారు. సర్వే నెంబర్ 289/3లో పూరా విస్తీర్ణం రెవెన్యూ రికార్డుల ప్రాప్తికి 6.47 ఎకరాలను 24 మంది రైతుల అనుభవంలో ఉంది. 2017 తర్వాత ఇదే సర్వే నెంబర్‌లో పూరా విస్తీర్ణం 12.94 ఎకరాలుగా మారిపోయింది. క్షేత్రస్థాయిలో భూమి లేకున్నా రికార్డుల్లో మాత్రం 12.94 ఎకరాలుగా చూపిస్తుంది. అప్పటి నుంచి హక్కు అనుభవంలో ఉన్న రైతులకు 1-బీ, అడంగల్ రావడం నిలిచిపోయింది. రికార్డులను ట్యాంపరింగ్ చేసి వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేసుకోవడంతో సాంబయ్య పేరుతో రావడం ప్రారంభమైంది. అప్పటి అధికార పార్టీ నాయకుల అండతో సాంబయ్య మేనేజ్ చేసుకుంటూ వచ్చాడు. అదే రీతిన మెళియాపుట్టి మండలం చిన్న, పెద్ద కొత్తూరులో 3.50 ఎకరాలు, గేదెలపోలూరులో 2.40 ఎకరాలు, పద్దలో 1.09 ఎకరాలను తహసీల్దారు చలమయ్య హయాంలో సాంబయ్య పేరుతో రికార్డుల్లోకి ఎక్కిపోయింది. ఈ భూమంతా ప్రభుత్వ భూమేనంటూ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. ఈ వివాదంపై ఇద్దరు కలెక్టర్లు, జేసీ, సబ్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను నలుగురు తహసీల్దార్లు పక్కన పెట్టేశారు. రెవెన్యూ రికార్డులను మాయం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు సదరు భూమిపై స.హ. చట్టం ద్వారా సమాచారం అడిగితే రికార్డులు అందుబాటులో లేవని చెప్పి తప్పించుకుంటున్నారని బాధితులు చెబుతున్నారు. సర్వే నెంబర్ 289/3లో ఉన్న భూమిని 1980లో పెద్దిన రామలింగం సుబుద్ధి కుమారుల నుంచి కొనుగోలు ద్వారా సంక్రమించిన అనుభవ హక్కులు కలిగివున్న రైతులు 2022లో టెక్కలి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ విచారణ చేసి సాంబయ్య ఈ-పాస్ బుక్కులను రద్దు చేసి 1-బీ అడంగల్ నుంచి పేరును 30 రోజుల్లో తొలగించాలని మెళియాపుట్టి తహసీల్దారును ఆదేశించారు. సబ్‌కలెక్టర్ ఆదేశాలను తహసీల్దార్ అమలుచేయలేదు. టెక్కలి సబ్‌కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపేయాలని జేసీకి ఆక్రమణదారుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేసిన జేసీ టెక్కలి సబ్‌కలెక్టర్ ఉత్తర్వులను అమలుచేయాలని తహసీల్దారుకు ఈ ఏడాది జూన్ 19 ఆదేశించారు. మెళియాపుట్టి రెవెన్యూ అధికారులు జేసీ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు ప్రారంభించి అసిస్టెంట్ డైరెక్టర్, సర్వేశాఖ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి 24మంది రైతులకు అనుభవ హక్కులు కల్పించి జేసీకి నివేదిక ఇచ్చారు. ప్రస్తుతం జేసీ కోర్టులో వివాదం నడుస్తుంది.

## రెవిన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. యారబాడు గ్రామంలో రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రీ-సర్వే జరిగిన గ్రామాల్లో తప్పుగా నమోదైన వాటిని సరిచేయడానికే ప్రభుత్వం రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. గతంలో భూములు రీ-సర్వే జరిగిన సమయంలో విస్తీర్ణం పరంగా తేడాలుంటే వాటికి సంబంధించిన వాటిని సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరించగలమన్నారు. రీసర్వేలో తప్పుగా నమోదైన పేర్లను కూడా సరిచేస్తారని, పట్టాదారుడు మరణిస్తే వారసులకు సరైన ఆధారాలతో మార్పు చేయబడుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కోవిడ్ బాధిత బాలల పేరుతో డిపాజిట్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

2021లో ప్రవేశపెట్టిన పీఎం కేర్‌ఫర్ చిల్డ్రన్ పథకంలో జిల్లాకు చెందిన తొమ్మిదిమంది కోవిడ్ బాలలకు ఒక్కొక్కరికి రూ.10లక్షలు చొప్పున మంజూరుచేసి స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో కలెక్టర్ గార్డియన్‌గా పిల్లలతో జాయింట్ అకౌంట్ చేసి డిపాజిట్ చేసినట్టు సూపరింటెండెంట్ వి.హరిబాబు తెలిపారు. బాలలు మేజర్లు అయిన తర్వాత సింగిల్ అకౌంట్‌గా మార్చి ప్రతినెల స్టైఫండ్ రూ.5,500 వారి వ్యక్తిగత ఖాతాలో జమ చేసినట్టు తెలిపారు. డిపాజిట్ చేసిన నాటి నుంచి సోమవారం వరకు మొత్తం చింతపల్లి మూర్తి రూ.1.68 లక్షలు, చింతపల్లి గీత రూ.1.32 లక్షలు సొంత ఇల్లు నిర్మాణం కోసం విత్‌డ్రా చేసుకున్నట్టు తెలిపారు. సదరు మొత్తాన్ని పోస్టాఫీస్, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, హెడ్ పోస్ట్‌మాస్టర్ పి.రంగారావు, బాలల రక్షణ అధికారి ఐ.లక్ష్మీనాయుడు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ భానోజీరావు సమక్షంలో పిల్లలకు అందజేసినట్టు తెలిపారు.

## అత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి

(సత్యంన్యూస్, పలాస)

పలాసలో అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కాశీబుగ్గ ఎస్సై చంద్రరావుకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గలో గంజాయి మద్యం రోజురోజుకి అధికమవుతుందని, విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి నిషేధించడంలో ఎన్డీయే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పోలీసులు నిఘా వ్యవస్థ మరింత పెంచి ఇలాంటి దుర్ఘటన భవిష్యత్తులో పునావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు పవన్, నాయకులు జస్వంత్, జీవన్, ఈశ్వరరావు, చందు పాల్గొన్నారు.




# అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

94403 72300,
98487 96626


## మన ఆరోగ్యం మన చేతిలోనే

- ప్రకృతి వైద్యనిపుణులు డాక్టర్ చిలుకు లక్ష్మీకాంత్ -




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సంపూర్ణ ఆరోగ్యం నిత్య యోగ సాధన, ప్రకృతి వైద్యం ద్వారా సాధ్యమవుతుందని ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ చిలుకు లక్ష్మీకాంత్ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రకృతి వైద్య అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కొత్త వ్యాధులు ప్రబలుతూ నిండు జీవితాలను నాశనం చేస్తున్నాయని అన్నారు. ప్రకృతి వైద్యం ద్వారా అన్ని రకాల వ్యాధులు నయమవుతాయన్నారు. ప్రతిఒక్కరూ జీవనశైలి నుంచి విషపూరిత పదార్ధాలను తొలగించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. అవగాహన సదస్సులో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బీవీ రవిశంకర్, బి.దేవీప్రసాద్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.లక్ష్మీ, జి.వాసుదేవరావు, సుగంధం సంజీవరావు, గుడ్ల జగ్గారావు, పొట్నూరు నాగేశ్వరరావు, ఎం.మల్లిబాబు, డాక్టర్ ఎం.వాసుదేవ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటాక్ డైరెక్టర్‌ను కలిసిన శ్రీకాకుళం ప్రతినిధులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇంటాక్ శ్రీకాకుళం ప్రతినిధులు, లోది ఎస్టేట్, న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో చాప్టర్ డివిజన్ ఇంటాక్ డైరెక్టర్ జీపీ అరవింద్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలసి శ్రీకాకుళంలో జరిగిన, జరగాల్సిన కార్యక్రమాలపై వివరించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా, దూసి రైల్వే నిలయంలో తలపెట్టనున్న గాంధీ విగ్రహ ప్రతిపాదన వివరాలతో పాటు, గత మూడు రోజుల ముందు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వరన్, విశాఖపట్నం డిఆర్‌ఎంలు వచ్చి పరిశీలించిన విషయాన్ని ఇంటాక్ ప్రతినిధి పొన్నాడ రవికుమార్ ప్రస్తావించారు. శ్రీకాకుళం వివరాలను అడిగి తెలుసుకున్న శుక్ల, శ్రీకాకుళం ఇంటాక్ ప్రతినిధులను అభినందిస్తూ, శ్రీకాకుళానికి మంచి టీం ఉందని, ఇంటాక్ భవిష్యత్ కార్యాచరణాలపై దృష్టిసారించి విజయపథంపై అడుగులు వేయాలన్నారు. అనంతరం శ్రీకాకుళం ప్రతినిధులు మాట్లాడుతూ శ్రీకాకుళం ఇంటాక్ సభ్యులను వెన్నుతట్టి ప్రోత్సాహించిన ఇంటాక్ డైరెక్టర్ అరవింద్ శుక్లాకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంటాక్ డైరెక్టర్‌ను కలిసినవారిలో శ్రీకాకుళం ఇంటాక్ ప్రతినిధులు పొన్నాడ రవికుమార్, జలుమూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## వైద్యానికి గురునాథ్ స్నేహితులు సాయం



(సత్యంన్యూస్, టెక్కలి)

కోటబొమ్మాళి మండలం సీతన్నపేట గ్రామానికి చెందిన ఇప్పిలి త్రినాధరావుకు ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వారు నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడమే కాకుండా, ఆయన వైద్యానికి చాలా డబ్బులు అవసరం ఉండటంతో రూ.30వేలు ఆర్థిక సహాయాన్ని గురునాథ్ యాదవ్ స్నేహితులు అందించారు. ఈ కార్యక్రమంలో గురునాథ్‌తో పాటు పిలక ధనుంజయ్ మాస్టారు, తలగాన రాంబాబు, బోరుభద్ర రాంబాబు, గండేటి పవన్‌కుమార్, కర్రి జగదీష్, డొక్కరి అప్పన్న, పిల్లల లక్ష్మణ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఏర్పాటు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




భారత రాజ్యాంగం ప్రసాదించిన మానవ హక్కుల పరిరక్షణకు శ్రీకాకుళంలోని దాదాపు 24 ప్రజాసంఘాలు కలసి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. గత రెండు రోజులుగా వివిధ సంఘాల ప్రతినిధులతో చర్చించి, ఈ నిర్ణయం తీసుకున్నట్టు వేదిక ప్రతినిధి పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బహుజన వర్గాలతోపాటు కనీస మానవ హక్కులకు కూడా రక్షణ లేని స్థితిలో వర్తమాన పరిస్థితులు ఉన్నాయని, వేర్వేరు సంఘాల పేరుతో హక్కుల రక్షణకు పని చేస్తూనే ఒక ఐక్యవేదిక ఏర్పాటు చేయాలని చాలామంది మేధావుల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. నవంబర్ చివరి వారంలో ఈ వేదిక జిల్లా తొలి మహాసభ జరపాలని నిర్ణయించినట్టు తెలిపారు. వేదిక కన్వీనర్‌గా సీనియర్ నాయకులు, న్యాయవాది బొడ్డేపల్లి మోహన్‌రావును (ఐలూ) ఎన్నుకున్నారు. సభ్యులుగా కె.రామగోపాల్ (సామాజిక న్యాయపోరాట సమితి), చింతాడ కృష్ణారావు (అరసం), డి.గణేష్ (ఎస్ఎన్‌పిఎస్), పేడాడ కృష్ణారావు (డిటిఎఫ్), వంకల మాధవరావు (ఏఐకేఎంఎస్), చల్లా శాంతారావు (ఆదివాసి జేఏసీ), పంచాది పాపారావు (రైతు సంఘం), సీర రమేష్ (బహుజన టీచర్స్ అసోసియేషన్), కె.వి. జగన్నాధరావు (మానవ హక్కుల వేదిక), మిస్క కృష్ణయ్య (కేఎన్‌పిఎస్), మద్దిల వినోద్ (పిడిఎస్‌యు), బొయిది మురళీకృష్ణ (ఎస్సీ ఎస్టీ లాయర్స్ యూనియన్), మద్దెల మాధవరావు (ఏఐకేఎం), ఎన్.ఈశ్వరరావు (ఏపీయూడబ్ల్యూజే), ఎంవి మల్లేశ్వరరావు (స్వామ్నా) తదితరులను సభ్యులుగా ఎన్నుకున్నట్టు వివరించారు. గౌరవ సలహాదారుగా సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత నల్లి ధర్మారావును సమావేశం ఎన్నుకున్నట్టు కృష్ణారావు తెలిపారు.

### వెనుకబాటుతనానికి

## పాలకులే బాధ్యులు

(సత్యంన్యూస్, పలాస)

కర్షక, కార్మికుల శ్రమదోపిడీ, వ్యవసాయ సంక్షోభం, వెనుకబాటుతనానికి పాలకులే బాధ్యులని వ్యవసాయ ఆర్థిక నిపుణులు, రైతు స్వరాజ్య వేదిక వ్యవస్థాపకులు కన్నేగంటి రవి ఆరోపించారు. ఆదివారం వ్యవసాయ సదస్సును పురస్కరించుకొని హరిపురంలోని మార్పు పద్మనాభం గ్రంథాలయం వద్ద సర్దార్ మార్పు పద్మనాభం, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలిగాం జంక్షన్‌లోని నరేష్ పంక్షన్ హాల్‌లో నియోజకవర్గం రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు అధ్యక్షతన రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వ్యవసాయం సంక్షోభంలో ఉందన్నారు. 51శాతం మంది వర్షాధారంపై అధారపడి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వ్యవసాయం ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేదన్నారు. రైతులు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దానంలో జీడీ కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధరలు లేదని అధికార ప్రతిపక్ష పార్టీలు హామీలే తప్ప రైతంగం పక్షాన నిలబడడం లేదని ఆరోపించారు. వ్యవసాయం అసంఘటిత కార్మికుల చట్టాల తీరుపై పికెఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.అన్నపూర్ణ మాట్లాడుతూ రాజ్యాంగంలోని పొందుపరిచిన చట్టాలను పాలకులు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. ముందుగా ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతికి రెండు నిముషాల మౌనం పాటించి జిల్లాలో పలు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం తీర్మానం చేశారు. సమావేశంలో డిటిఫ్ కార్యదర్శి పి.కృష్ణారావు, రైతు సంఘ ప్రతినిధులు నల్ల హడ్డి, గొర్రెల చలపతిరావు, రాపాక చిన్నారావు, దాసరి శ్రీరాములు, డొక్కర వీరస్వామి, ఎం ధర్మారావు, లింగమూర్తి, తామాడ త్రిలోచన, ఎం.ముకుందరావు, మిస్క క్రిష్ణయ్య, కోత ధర్మారావు, వంకల మాధవరావు, జుత్తు వీరాస్వామి, బి.సింహాద్రి, కృష్ణమూర్తి, సింహాచలం, సోమనాదం, దుర్యోధన, మహేంద్ర, రైతు సంఘం అధ్యక్షులు బికామేశ్వరరావు పాల్గొన్నారు




## ఇద్దరు డీటీలకు అడ్‌హాక్ ప్రమోషన్

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లకు అడహాక్ తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సరుబుజ్జిలి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న డిప్యూటీ ఎం.చక్రవర్తి, కలెక్టరేట్ జీ-విభాగం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డెప్యూటేషన్‌పై కొనసాగుతున్న జీఎల్ఈ శ్రీనివాసరావుకు అడహాక్ ప్రమెషన్ కల్పించారు. తహసీల్దారుగా ఉద్యోగోన్నతి పొందిన చక్రవర్తి కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, జీఎల్ఈ శ్రీనివాసరావు జీ సెక్షన్ రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి పొందడానికి అర్హతలు ఉన్నా సాంకేతక కారణాల దృష్ట్యా రెండేళ్లుగా ఉద్యోగోన్నతి పొందలేకపోయారు. ఉద్యోగోన్నతి కల్పించినందుకు కలెక్టర్, జేసీ, డీఆర్‌వో, ఏవోకు కృతజ్ఞతలు తెలిపారు.

# డిగ్రీ స్పెషల్ ఫీజులు రద్దుచేయాలి

- ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐతో కలిసి విద్యార్థులు ధర్నా




(సత్యంన్యూస్, టెక్కలి)

డిగ్రీలో స్పెషల్‌ఫీజులను రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రభుత్వ, 47 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెనలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాదీవెన, వసతి దీవెనలను పేర్లు మార్పులు చేసి కళాశాల యాజమాన్యాల ఖాతాల్లోకి జమ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం మర్చిపోయి, లడ్డుప్రసాదం, ఇసుక, మద్యంపై దృష్టి సారించిందని ఆరోపించారు. విద్యారంగం, విద్యార్థుల అభివృద్ధిపై ఏమాత్రమైన చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. డిగ్రీ విద్యార్థులకు భారం అవుతున్న స్పెషల్ ఫీజులను తక్షణమే రద్దు చేయాలన్నారు. విద్యార్థులకు న్యాయం జరగకపోతే జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను కేంద్రీకరించే రిలే నిరాహార దీక్షలకు భవిష్యత్తులో పిలుపునిస్తామన్నారు. కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, యు.దుర్గాప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, నాయకులు పవిత్ర, నగేష్, దివ్య, వెన్నెల, వందన, చిన్ని, ఉమామహేష్, తరుణ్, శ్రావణ్ పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.